జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ
డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
వీక్షించండి
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి వాటిని జాతీయ వార్త తెలుగు దినపత్రికలో ప్రచురిస్తాం.. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.
ఎడిటర్: చౌదరి, 9963063761

బుధవారం | 14-10-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 807 పేజీలు: 4 వెల: రూ.7

## కటకటాల్లోకి...
# పేకాటరాయుళ్లు



- ఒడిశాలో పేకాట ఆడుతూ పట్టుబడిన శ్రీకాకుళం జిల్లావాసులు
- అదుపులో 71 మంది.. అందులో 44 మంది జిల్లావాసులే
- శ్రీకాకుళం నగరానికి చెందిన వారు 20 మందికిపైనే
- ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో జోరుగా పేకాట
- జిల్లాకు చెందిన వ్యక్తుల ఆధ్వర్యంలోనే నిర్వహణ
- పోలీసులకు చిక్కకుండా తరచూ స్థలాలు మార్పు

శ్రీకాకుళం, అక్టోబర్ 13 (వార్త): ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో గత కొన్నేళ్లుగా పేకాట జోరుగా సాగుతోంది. తొలుత శ్రీకాకుళం జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో జోరుగా పేకాట ఆడుకునేవారు. గుట్టుచప్పుడు కాకుండా జీడి, మామిడి తోటల్లో ఎవరూ ఆ ప్రాంతానికి వెళ్లకుండా గట్టి కాపలా మధ్య జిల్లా కేంద్రానికి చెందిన కొందరు పేకాట నిర్వహించేవారు. బాగా బలిసివున్న వారినే పేకాటకు ఆహ్వానం పలికేవారు. వారికి మందుతో పాటు బిరియాని, తదితర సకల సదుపాయాలు కల్పించడంతో పేకాట ఆడేవారి సంఖ్య బాగా పెరిగింది. నిర్వాహకులకు మంచి డబ్బులు కూడా వచ్చేవి. ఆడే వారి కన్నా ఆడించే వారికే కాసులు గలగలలాడాయి. పోలీసులకు దొరకకుండా తరచూ మకాం మార్చేస్తుండేవారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పేకాట ఆడ్డాలను గుర్తించి తరచూ ప్రత్యేక బృందాలతో దాడులు చేయించారు. దీంతో కొందరు పేకాట నిర్వాహకులు ఒడిశాకు మకాం మార్చారు. కొద్ది నెలల కిందట రాయగడ జిల్లా ప్రాంతంలో ఓ పేకాట శిబిరం వద్ద జిల్లాకు చెందిన వారిపై ఒడిశాకు చెందిన ఓ ముఠా దాడికి దిగి సర్వం దోచుకున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ ఘటనలో ముఠా నాయకుడి అనుచరుడిపై మరో ముఠా దాడి చేసి హత్య చేసిన ఉదంతం కూడా వెలుగులోకి వచ్చింది. అయితే ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ బడా బాబు ఆధ్వర్యంలో కొందరు ముఠాగా ఏర్పడి ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాలైన మెళియాపుట్టి, పర్లాకిమిండి సమీప ప్రాంతాల్లో ఓ భవనాన్ని అద్దెకు తీసుకుని పేకాట ఆడిస్తున్నారు. ఆంధ్రాలో పోలీసుల దాడి ఎక్కువగా ఉండడంతో ఒడిశానే సేఫ్ ప్రాంతంగా ఎంచుకుని మరీ పేకాటను నిర్వహిస్తున్నారు. అయితే ఒడిశా పోలీసులు పక్కా సమాచారంతో ఆదివారం దేవితి సమీపంలోని జైమాతాదీ కల్యాణ మండపంలో స్టార్ రిక్రియేషన్ అండ్ కల్చరల్ క్లబ్ పేరుతో భారీ ఎత్తున పేకాట ఆడుతున్న వారిపై దాడులు చేశారు. జూదమాడుతున్న దాదాపు 71 మందికి పైగా వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 12.13 లక్షల, 9 కార్లు, 60 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. 71 మందిలో 44 మంది శ్రీకాకుళం జిల్లా వాసులు కాగా, 20 మంది శ్రీకాకుళం పట్టణానికి చెందిన వారే ఉన్నారు. వారిని గజపతి జిల్లా ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. పట్టుబడిన వారిలో ఎక్కువగా నడివయస్కులైన వ్యాపారులే ఉన్నారు. వారంలో ఐదురోజులు వ్యాపారాలు చేసుకుని, శని, ఆదివారాల్లో వీరంతా ఒడిశాకు పేకాట ఆడేందుకు వెళుతుంటారు. తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం సంపాదించాలన్న ఆశతో వీరంతా పేకాట ఆడుతూ అప్పులపాలవుతున్నారు. ఆస్తులను తనఖాపెట్టి, పది రూపాయలకు పైగానే వడ్డీకి తీసుకుని కొందరు పేకాట ఆడుతున్నారు. వీరికి అప్పులు ఇచ్చే వారు కూడా నిర్వాహకులే. పేకాట ఆడి దొరికితే ఏమవుతుంది.. కోర్టులో ఫైన్ పడుతుంది అంతే కాదా.. జైలుకు వెళతామా ఏంటి అన్న ధీమాలో కొందరు నిర్వాహకులు ఉన్నారు. పేకాట నిర్వాహకులు సైతం తమకు తెలిసిన వారినే పేకాట శిబిరాలకు తరలిస్తారు. కొత్తవారికి ఎంట్రీ ఇవ్వరు. ఒకవేళ కొత్తవారు ఆడాలంటే తరచూ పేకాట ఆడేవారు రికమండేషన్ చేయాలి. నిర్వాహకులు సైతం పేకాట శిబిరాల వద్ద సర్వ సదుపాయాలు కల్పిస్తుండడంతో నిత్యం జిల్లా నుంచి ఒడిశా ప్రాంతం వైపు కారులో వెళ్లే వారి సంఖ్య బాగా పెరిగింది. శని, ఆదివారాల్లో అయితే సుమారు మూడంకెల సంఖ్యలో కారుల్లో వెళుతుంటారు. పేకాట నిర్వాహకులపై పోలీసులు గట్టి నిఘా పెడితే కొంతవరకైనా పేకాట శిబిరాలను అడ్డుకోవచ్చు.








## అత్యుత్తమ హెల్త్ సిటీగా..
# జీజీహెచ్‌ను అభివృద్ధి చేస్తా

- పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తాం
- కార్పొరేట్‌కు దీటుగా సేవలు అందించండి
- మున్ముందు మరిన్ని నిధులు తీసుకువస్తాం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- జీజీహెచ్‌లో రూ.4.52 కోట్ల అధునాతన వైద్య పరికరాలు ప్రారంభం



శ్రీకాకుళం, అక్టోబర్ 13 (వార్త): పేద ప్రజలకు కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా నాణ్యమైన వైద్య సేవలను ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అందించాలనే లక్ష్యంతో శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ.4.52 కోట్లతో నిర్మాణ్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన అధునాతన వైద్య పరికరాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం పరికరాల ద్వారా అందించే వైద్య సేవలను ఆసుపత్రి సిబ్బందిని అడిగి తెలుసుకుని, సభా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రూ.4.52 కోట్ల విలువైన అధునాతన వైద్య పరికరాలను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వీటిలో కొన్ని పరికరాలు జిల్లాలోనే అందుబాటులో లేవని, మరికొన్ని ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాల్లోనూ లేవని, ఇంకొన్ని రాష్ట్రంలోనే అందుబాటులో లేని స్థాయిలో అధునాతనమైనవని పేర్కొన్నారు. ఇలాంటి పరికరాలు నేడు శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులోకి రావడం జిల్లాలో వైద్య సేవల అభివృద్ధికి కీలక ముందడుగని చెప్పారు.భోగాపురం విమానాశ్రయ నిర్మాణంలో ఎంతటి నిబద్ధతతో పనిచేశామో, అదే నిబద్ధతతో శ్రీకాకుళం జీజీహెచ్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నానని మంత్రి తెలిపారు. వ్యక్తిగత బాధ్యతగా తీసుకుని, ముందస్తు జాగ్రత్తలు, వ్యాధుల నివారణకు ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి కార్యాచరణ చేపట్టామన్నారు. డయాగ్నస్టిక్ పరీక్షలకు అవసరమైన పరికరాలు అందుబాటులో లేవని వైద్యులు తన దృష్టికి తీసుకురావడంతో 12 విభాగాలకు సంబంధించి 72 పరికరాలను సమకూర్చినట్లు వివరించారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన పరికరాలతో వైద్య పరీక్షలు, చికిత్సల్లో సమయం గణనీయంగా ఆదా అవుతుందని మంత్రి తెలిపారు. గతంలో రోజుకు 60 శాంపిల్లను మాత్రమే పరీక్షించే సామర్థ్యం ఉండగా, ప్రస్తుతం గంటకు 60 శాంపిల్లను పరీక్షించే స్థాయికి సామర్థ్యం పెరుగుతుందని వివరించారు. గతంలో నాలుగు గంటల సమయం పట్టే కొన్ని శస్త్ర చికిత్సలు ఇప్పుడు కేవలం 15 నిమిషాల్లో పూర్తి చేసే సామర్థ్యాన్ని అందించే పరికరాలు కూడా అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ఇలాంటి మార్పులు రోగులకు వేగవంతమైన వైద్య సేవలు అందించడంతో పాటు వైద్యుల పనితీరును మరింత మెరుగుపరుస్తాయన్నారు. జిల్లాలోని ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, టెక్కలి, నరసన్నపేట తదితర ప్రాంతాల నుంచి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో రోగులు శ్రీకాకుళం జీజీహెచ్‌కు వస్తుంటారని మంత్రి తెలిపారు. అవసరమైన పరికరాలు లేకపోవడంతో కొంతమంది రోగులను కేజీహెచ్‌కు రిఫర్ చేయాల్సి వచ్చేదని, దీనివల్ల రోగులు అదనపు ప్రయాణ ఖర్చులు, సమయభారం ఎదుర్కొనేవారని పేర్కొన్నారు. ప్రస్తుతం అధునాతన పరికరాలు అందుబాటులోకి రావడంతో స్థానికంగానే మెరుగైన వైద్య పరీక్షలు, చికిత్సలు అందించే అవకాశాలు విస్తరిస్తాయని చెప్పారు.రూ.4.52 కోట్ల విలువైన ఈ పరికరాల ద్వారా ప్రతి సంవత్సరం రోగులకు సుమారు రూ.17 కోట్ల మేర వైద్య ఖర్చుల భారం తగ్గించే అవకాశం ఉందని మంత్రి వివరించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇది ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. పరికరాలను ఆసుపత్రికి తీసుకురావడం ఎంత ముఖ్యమో, వాటిని నిరంతరం పనిచేసేలా నిర్వహించడం కూడా అంతే ముఖ్యమని మంత్రి స్పష్టం చేశారు. గతంలో చిన్న వైర్ దెబ్బతిన్నా పరికరాలు సంవత్సరాల తరబడి మూలనపడే పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా వార్షిక నిర్వహణ ఒప్పందాల ద్వారా పరికరాల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు.ప్రతి పరికరాన్ని బాధ్యతగా వినియోగించాలని, ఆసుపత్రి సిబ్బంది వాటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పరికరాల వినియోగం, పనితీరును ప్రతి నెలా శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి సమీక్షిస్తానని చెప్పారు. పరికరాల వల్ల కలిగే ప్రయోజనాలు పూర్తిస్థాయిలో రోగులకు అందినప్పుడే ఈ కార్యక్రమం లక్ష్యం నెరవేరుతుందని స్పష్టం చేశారు. శ్రీకాకుళం జీజీహెచ్‌లో కొత్త ఆశలను నింపుతూ, కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. చిన్నచిన్న మార్పులు కూడా ప్రజల జీవితాల్లో పెద్ద ప్రభావాన్ని చూపుతాయని పేర్కొన్నారు. ఆసుపత్రిలో వ్యర్థ జలాల శుద్ధి ప్లాంట్‌ను ఆధునీకరించడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు.2 024-25 ఆర్థిక సంవత్సరంలో జీజీహెచ్‌లో 3,30,255 మంది ఔట్ పేషెంట్లు (ఓపీ) సేవలు పొందగా, 2025-26లో ఈ సంఖ్య 4,59,663కు చేరిందని మంత్రి తెలిపారు. ఓపీ సేవల్లో సుమారు 39 శాతం వృద్ధి నమోదైందన్నారు. ఇదే సమయంలో ఇన్‌పేషెంట్ సేవల్లో 5.85 శాతం, శస్త్రచికిత్సల్లో 15.61 శాతం, వైద్య పరీక్షల్లో 48.69 శాతం, ఎన్టీఆర్ వైద్య సేవల కేసుల్లో 21.56 శాతం వృద్ధి నమోదైందని వెల్లడించారు. ఈ గణాంకాలు ఆసుపత్రిపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. జీజీహెచ్‌లో చదువుతున్న వైద్య విద్యార్థులు కూడా ఈ మార్పులకు ప్రచారకర్తలు గా మారాలని మంత్రి పిలుపునిచ్చారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించాలని, ఆసుపత్రిలోకి అడుగుపెట్టగానే ఆలయానికి వచ్చినంత ప్రశాంతత, భరోసా కలగాలని ఆకాంక్షించారు. రోగికి ధైర్యం కల్పించే వాతావరణాన్ని సృష్టించడం వైద్య సేవల్లో కీలకమని అన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ దేశవ్యాప్తంగా అనేక సామాజిక బాధ్యత కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికీ, శ్రీకాకుళం జిల్లాకు అధునాతన వైద్య పరికరాలను అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఐ ఓ సి ఎల్, నిర్మాణ్ సంస్థలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే బోయింగ్ సంస్థతో చర్చించి రూ.43 లక్షల విలువైన మరో వైద్య పరికరాన్ని సమకూర్చినట్లు, న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ద్వారా రూ.కోటి నిధులను తీసుకొచ్చినట్లు వివరించారు. ఆసుపత్రి సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాల కోసం నిధులు అందుబాటులోకి వచ్చాయని, వాటితో తదుపరి పనులు చేపడతామని తెలిపారు. ఈ పరికరాల ఏర్పాటుకు సంబంధించి జూన్ 9న ఒప్పందం కుదుర్చుకుని, కేవలం మూడు నెలల్లోనే పరికరాలను ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకురావడం విశేషమని మంత్రి పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యుత్తమ హెల్త్ సిటీగా అభివృద్ధి చేయడమే తమ సంకల్పమని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ఆసుపత్రి అభివృద్ధిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని, అందుబాటులోకి వచ్చిన అధునాతన వైద్య పరికరాలను సమర్థవంతంగా వినియోగించినప్పుడే లక్ష్యాన్ని సాధించగలమన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే నిజమైన అభివృద్ధి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐ.ఓ.సి.ఎల్ ఈ.డి. ఎస్.హెచ్, పీయూష్ మిట్టల్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, మామిడి గోవిందరావు, నిర్మాణ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మయూర్ పట్నాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# రాజపురం రోడ్డులో విద్యుత్ శాఖ విధ్వంసం

- పచ్చని చెట్లు దారుణంగా నరికివేత
- ఆవేదన చెందుతున్న పర్యావరణ ప్రేమికులు
- న్యాయస్థానాల్లో కేసులు వేస్తున్నా పట్టించుకోని అధికారులు

(కవిటి)

విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పర్యావరణానికి పెద్ద ఎత్తున తూట్లు పొడుస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు పెద్దపీటవేయాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వృక్షో రక్షతి రక్షితః అంటూ అనేక నినాదాలు నిరంతరం వినిపిస్తున్న నేపథ్యంలో ఇవేమీ విద్యుత్ శాఖ అధికారుల చెవికి ఎక్కడం లేదు. కవిటి మండలం రాజపురం-కొజ్జిరియా రోడ్డులో అడ్డగోలుగా పచ్చని చెట్లు నరికివేసి విధ్వంసం సృష్టించడం ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. రోడ్డుకు ఇరువైపులా గతంలో నాటిన మొక్కలు చక్కగా పెరిగి ఎంతో అందంతో వికసిస్తున్న పరిస్థితుల్లో ఇష్టారాజ్యంగా చెట్లు నరికి వేసి పర్యావరణానికి తలవంపులు తేవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యుత్ తీగల కు ఇబ్బందికరంగా ఉన్నాయన్న సాకుతో చిగురు కొమ్మలను నరకాల్సింది పోయి ఏకంగా చెట్టు అడుగు భాగంలో కాండాలను అడ్డంగా నరికి వేయడంతో పచ్చదనాన్ని పూర్తిగా నాశనం చేస్తున్నారంటూ విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇలా ఒక్క రాజపురం రోడ్డులోనే కాకుండా విద్యుత్ శాఖ ప్రతిచోట ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పచ్చని చెట్లపై పగబట్టినట్లు వ్యవహరిస్తున్నారని చాలామంది ఆరోపిస్తున్నారు. గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు,పర్యావరణ సంస్థలు, పర్యావరణ ప్రేమికులు ఇలా ఎంతోమంది మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, పచ్చదనానికి పెద్దపీట వేయాలని, పచ్చదనమే మనకు ప్రాణవాయువు అని ఎంతో కాలంగా చెబుతున్న విషయం అందరికీ తెలుసు. దీన్ని స్పందిస్తూ అనేకమంది వ్యక్తులు, విద్యార్థులు, సంస్థలు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ప్రతి చోటా ఉద్యమంలా మొక్కలు నాటడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. వాటి సంరక్షణకు



కూడా అంతే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇలా పెరిగిన చెట్లను చెప్పా పెట్టకుండా ఇష్టారాజ్యంగా, అడ్డగోలుగా నరికి వేస్తూ మున్ముందు మొక్కల పెంపకానికి ఎవరూ ముందుకు రాని పరిస్థితి కల్పిస్తున్నారు.

## విద్యుత్ శాఖ తీరుపై పలుచోట్ల కేసులు :

ఇలా ఇష్టారాజ్యంగా పచ్చని చెట్లను నరికి వేస్తున్న విద్యుత్ శాఖ తీరుపై పలుచోట్ల కోర్టు కేసులు నడుస్తూ ఉన్నాయి. ఎం జె పూలే రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు బీన ఢిల్లీ రావు ఇదే సమస్యపై సోంపేట కోర్టులో విద్యుత్ శాఖ ఉన్నతాధికారిపై కేసు వేయడం తెలిసిందే. ఈ కేసు పై ఇప్పటికీ ఇరువర్గాలను విచారిస్తున్నారు.

అయినప్పటికీ అదే అధికారి పరిధిలో మారుమూల గ్రామాల్లో ఇలా చెట్లను భారీ ఎత్తున నరికి వేయడం గమనిస్తే పర్యావరణంపై వారికి ఉన్న ప్రేమ ఏపాటిదో విషమవుతుంది. జిల్లా కలెక్టర్ వంటి ఉన్నతాధికారులు ఇటువంటి విధ్వాంసకర పరిస్థితులపై స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## రాజపురంలో ఘనంగా దేవీ నవరాత్రులు




**కవిటి, అక్టోబరు 13 (వార్త):** రాజపురం గ్రామంలో దేవీ నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. విద్యుత్ కాంతుల నడుమ అందమైన అలంకరణలతో అమ్మవారి విగ్రహానికి ప్రతిరోజు ఉదయం సాయంత్రం వేళ విశేష పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుంటున్నారు. భక్తులకు ప్రతిరోజు తీర్థప్రసాదాలు అందజేస్తున్నారు. ప్రతిరోజు సాయంత్రం వేళ అమ్మవారి మండపంలో వివిధ సాంస్కృతిక సంగీత కచేరి కార్యక్రమాలు నిర్వహిస్తూ అమ్మవారికి నీరాజనం అర్పిస్తున్నారు.

## హరిపురంలో రూ. కోటితో వాటర్ ట్యాంక్

-ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవ

-భూమి పూజ ఘనంగా నిర్వహించిన నాయకులు



**మందస, అక్టోబరు 13(వార్త):** పలాస నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా శాసనసభ్యురాలు గౌతు శిరీష ముందుకు సాగుతున్నారని మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన పేర్కొన్నారు. మందస మండలంలోని హరిపురం గ్రామంలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని గుర్తించిన ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రభుత్వంతో మాట్లాడి ప్రత్యేక చొరవతో జల జీవన్ మిషన్ పథకం కింద రూ.కోటి నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో నిర్మించనున్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు సంబంధించి మంగళవారం హరిపురంలో భూమి పూజ చేసి, కొబ్బరికాయ కొట్టి పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే గౌతు శిరీష నియోజకవర్గ ప్రజల తాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రతీ ఇంటికీ స్వచ్ఛమైన నీటిని అందించాలనే ధ్యేయంతోనే ఈ పథకాన్ని వేగంగా పట్టాలెక్కించారని కొనియాడారు. ఎమ్మెల్యే గౌతు శిరీష నిరంతర కృషికి హరిపురం గ్రామస్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో ముఖ్య నాయకులు బైరిశెట్టి గున్నయ్య, కొత్ర వైకుంఠ రావు, పుల్ల వాసుదేవ్ లతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రాంపురం-బిడిమిలో బీటీ రోడ్డు ప్రారంభించిన ఎంఎల్ఏ శిరీషా



**మందస, అక్టోబరు 13(వార్త):** పలాస నియోజకవర్గ సమగ్ర అభివృద్ధియే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని, గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రాధాన్యత అని పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష పేర్కొన్నారు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన రాంపురం-బిడిమి గ్రామంలో రూ.82 లక్షల పంచాయతీ రాజ్/ఆర్ అండ్ బి నిధులతో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును ఆమె ఘనంగా ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి రహదారిని ప్రజల వినియోగానికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ఆర్థిక, సామాజిక ప్రగతికి నాణ్యమైన రహదారులు ఎంతో ముఖ్యం. బిడిమి గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించడంతో స్థానిక విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు మరియు వ్యాపారుల ప్రయాణ కష్టాలు తొలిగిపోయాయి. ముఖ్యంగా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడానికి, అత్యవసర వైద్య సేవలు పొందడానికి ఈ రహదారి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొని ఎమ్మెల్యే శిరీష కృతజ్ఞతలు తెలిపారు.

## విగ్రహ శిల్పికి సన్మానం

**సోంపేట, అక్టోబరు 13(వార్త):** సోంపేటలో వైభవంగా జరుగుతున్న దేవీ నవరాత్రులలో శ్రీనివాస్ మహల్ జంక్షన్లో ఏర్పాటుచేసిన పూజా కార్యక్రమంలో నెలకొల్పిన విగ్రహ శిల్పి వెస్ట్ బెంగాల్ కు చెందిన రూప్ కుమార్ కు ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ చేతులమీదుగా మంగళవారం రాత్రి ఘనంగా సన్మానించారు. రూప్ కుమార్ కు దుస్సాలువ కప్పి జ్ఞాపిక అందించారు. అందరినీ ఆకట్టుకున్న దుర్గామాత విగ్రహాన్ని ఎంతో అందంగా రూపొందించిన రూప్ కుమార్ ను అందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ పేటకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.



# సోంపేటలో నవరాత్రుల శోభ





**సోంపేట, అక్టోబరు 13 (వార్త):** సోంపేట పట్టణంలో దసరా శరన్నవరాత్రులు శోభాయ మానంగా జరుగుతున్నాయి. వివిధ చోట్ల దేవి మండపాలు అలాగే అమ్మవారి ఆలయాల్లో విశేష పూజా మహోత్సవాలతో పెద్ద సంఖ్యలో విచ్చేస్తున్న భక్తులతో దసరా ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. కంచిలి రోడ్డు లోని దుర్గా చెరువు వద్ద శ్రీ విజయ దుర్గ అమ్మవారి ఆలయంలోను, శివా థియేటర్ వెనుక వైపు చీకటి సోమపాలమాంబ ఆలయంలోనూ, శ్రీసయన వీధిలో జలంత్ర సోమపాలమాంబ ఆలయంలోనూ, బూరగాం వెళ్లే రోడ్డులో శ్రీ నింభాషిని అమ్మవారి ఆలయంలోనూ అలాగే గాంధీ మండపం వద్ద ఏర్పాటుచేసిన దేవీ నవరాత్రుల మండపం వద్ద, శ్రీనివాస్ మహల్ జంక్షన్లో ఏర్పాటుచేసిన దుర్గా అమ్మవారి మండపం వద్ద నవరాత్రి ఉత్సవాలు ఆయా కమిటీల ఆధ్వర్యంలో ఎంతో ఉత్సాహంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆలయాల్లో వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఆయా ఆలయాల్లో నిర్వహించే కుంకుమ పూజల్లో పాల్గొంటున్నారు. అలాగే దేవీ మండపాల్లోనూ ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహిస్తున్న పూజలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. దసరా ఉత్సవాల సందర్భంగా ఆయాచోట్ల విద్యుత్ దీపాల అలంకరణలు ఇతరత్రా అలంకరణలతో దేవి మండపాలు అలాగే ఆలయాలు శోభాయమానంగా తీర్చిదిద్దబడ్డాయి. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచే భక్తులు నిత్యం ఆయా ఉత్సవాల వద్ద అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు. ప్రతిరోజు సాయంత్రం వేళ విశేష భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సాంస్కృతి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆలయాల వద్ద ప్రతిరోజు భక్తులకు తీర్థప్రసాదాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. విజయ దుర్గ ఆలయం వద్ద ప్రతిరోజు లక్కీ డ్రా నిర్వహిస్తూ భక్తులకు కానుకలు అందజేస్తున్నారు. దసరా ఉత్సవాలతో సోంపేట పట్టణం అందరినీ ఆకట్టుకుంటుంది.

## ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులకు వైసీపీ ఆత్మీయ సన్మానం



**నరసన్నపేట, అక్టోబరు 13 (వార్త):** నరసన్నపేట పట్టణంలోని మేఘన కన్వెన్షన్‌లో వైసీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులను సత్కరించే ఆత్మీయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, వైసీపీ నేత ధర్మాన కృష్ణచైతన్య హాజరై మాజీ ప్రజాప్రతినిధులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ధర్మాన కృష్ణచైతన్య మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు అధిక ప్రాధాన్యం కల్పించినట్లు పేర్కొన్నారు. ఆయా వర్గాల ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ చేయడంలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు నేరుగా సేవలు అందించినట్లు తెలిపారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులను గుర్తించి గౌరవించడం ద్వారా వారి సేవలను స్మరించుకోవచ్చని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మాజీ ప్రజాప్రతినిధులతో పార్టీ నాయకులు ఆత్మీయంగా మమేకమై, వారి అనుభవాలను పంచుకున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని కృష్ణచైతన్య పిలుపునిచ్చారు. పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఎస్సీ వర్గాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలివ్వాలి

- పదవీ విరమణ చేసిన వారి ప్రయోజనాలు చెల్లించాలి

-పలాస మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన దీక్ష

**పలాస, అక్టోబరు 13 (వార్త):** మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ మరణించిన, పదవీ విరమణ చేసిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలని, దీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలాస మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్.గణపతి మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఏళ్ల తరబడి పారిశుద్ధ్య పనులు నిర్వహించిన కార్మికులు మరణించినా, పదవీ విరమణ చేసినా వారి కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. దీర్ఘకాలం సేవలందించిన కార్మికులకు చెల్లించాల్సిన ప్రయోజనాలు, ముఖ్యంగా పదవీ విరమణ అనంతరం అందాల్సిన బకాయిలు, గ్రాట్యుటీ చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమన్నారు. కార్మికుల సేవలను వినియోగించుకున్న యంత్రాంగం వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన బాధ్యతను విస్మరించకూడదని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, శాశ్వత స్వభావం కలిగిన పనుల్లో శాశ్వత నియామకాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆప్కాస్ పేరుతో కాంట్రాక్టు పద్ధతిలో కార్మికులతో పనిచేయిస్తూ, వారికి తగిన ఉద్యోగ భద్రత కల్పించడం లేదని విమర్శించారు. దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల సేవలను గుర్తించి, నిబంధనలకు అనుగుణంగా వారిని క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ సేవలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే విధానంలో భాగంగా పని ఒప్పందాల పద్ధతిని ప్రోత్సహించడం వల్ల కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రతకు ముప్పు ఏర్పడుతోందని యూనియన్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ వంటి నిరంతర ప్రజాసేవల్లో పనిచేసే కార్మికులకు న్యాయమైన వేతనాలు, సేవా ప్రయోజనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పలువురు మున్సిపల్ కార్మికులు దీక్షకు మద్దతుగా హాజరయ్యారు. ఈ నిరసన దీక్షలో యూనియన్ నాయకులు కె.వెంకటి, బి.కూర్మారావుతో పాటు కె.ఈశ్వరరావు, ఎం.రవి, అమర్ నాయక్, భాస్కరరావు, ఎస్.రమేష్, సుజాత, కబేరి, పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.




## నరసన్నపేట డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూముల పరిశీలన



**నరసన్నపేట, అక్టోబరు 13 (వార్త):** నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను ఎంపీడీవో కేవీ ప్రసాద్‌రావు మంగళవారం పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన వసతులు, ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత సిబ్బందితో వివరాలు తెలుసుకున్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీపీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన బ్యాలెట్ సామగ్రి భద్రత, ఓట్ల లెక్కింపు నిర్వహణకు అనువైన ఏర్పాట్లు ఉండేలా అధికారులు పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కేవీ ప్రసాద్‌రావు పంచాయతీరాజ్ ఏఈ బగ్గు నరసింహమూర్తి, ఇతర సిబ్బందితో కలిసి కళాశాల పరిసరాలను, ప్రతిపాదిత స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే సమీక్షించడం ద్వారా విధుల్లో సమన్వయం, నిర్వహణలో సౌలభ్యం కల్పించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

## కొత్తరేవు ఎంపీటీసీ అభ్యర్థిగా అడ్ల శ్రీనివాసరావుకు మద్దతు



**పోలాకి, అక్టోబరు 13 (వార్త):** కొత్తరేవు ఎంపీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) తరపున అడ్ల శ్రీనివాసరావును స్థానికులు అభ్యర్థిగా బలపరిచారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు మద్దతు తెలిపిన వారితో కలిసి మబగాంలో వైసీపీ నేత ధర్మాన కృష్ణ చైతన్యను మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తరేవు ఎంపీటీసీ స్థానానికి సంబంధించి స్థానికులంతా ఏకాభిప్రాయంతో అభ్యర్థిని నిర్ణయించుకుని ఆయనకు మద్దతుగా నిలవడం అభినందనీయమని ఈ సందర్భంగా ధర్మాన కృష్ణ చైతన్య పేర్కొన్నారు. స్థానికుల సమన్వయం, కార్యకర్తల ఐక్యత పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో కీలకమని తెలిపారు. అభ్యర్థి విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలతో మమేకమవుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ భేటీలో అడ్ల శ్రీనివాసరావుకు మద్దతు తెలిపిన పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## బొంతు పీహెచ్‌సీలో ఉచిత కంటి పరీక్షల శిబిరం

- విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం
- మెరుగైన చికిత్స, ఆపరేషన్ల కోసం రోగులను విజయనగరం ఆసుపత్రికి తరలింపు

**సారవకోట, అక్టోబరు 13 (వార్త):** బొంతు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. విజయనగరంలోని వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సలపై వైద్యులు సూచనలు అందించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సుస్మిత ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి సంబంధిత సమస్యలను ముందుగానే గుర్తించడం, ప్రజలకు అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలపై అవగాహన కల్పించడం, అవసరమైన వారిని కంటి వైద్య నిపుణుల వద్దకు పంపించడం వంటి అంశాలపై చర్చించారు. శిబిరంలో నిర్వహించిన పరీక్షల్లో కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించిన రోగులను తదుపరి చికిత్సలు, అవసరమైన శస్త్రచికిత్సల కోసం విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రత్యేక వైద్య సేవలను చేరువ చేయడంలో ఇటువంటి శిబిరాలు దోహదపడతాయని వైద్య సిబ్బంది తెలిపారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# మున్సిపల్ పీఠం శ్రీజను వరించేనా?

## -నాలుగుసార్లు కౌన్సిలర్‌గా గెలిచిన దువ్వాడ శ్రీకాంత్ వారసత్వంపై చర్చ

## -అవకాశం వస్తే పోటీకి సిద్ధమంటున్నట్లు ప్రచారం



**పలాస, అక్టోబరు 13 (వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం చైర్‌పర్సన్ పదవిని చుట్టుముట్టి స్థానిక రాజకీయాల్లో అప్పుడే ఆసక్తికర చర్చ మొదలైంది. రాబోయే ఎన్నికల్లో మహిళలకు కేటాయించే స్థానంపై వివిధ పార్టీల్లో అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ఊహాగానాలు సాగుతున్న నేపథ్యంలో సీనియర్ రాజకీయ నాయకుడు, కార్మిక సంఘాల నేత దువ్వాడ శ్రీకాంత్ కుమార్తె డాక్టర్ దువ్వాడ శ్రీజ పేరు తెరపైకి వచ్చింది. వైద్య విద్యను అభ్యసించిన యువతిగా, రాజకీయ అనుభవం కలిగిన నాయకుడి కుమార్తెగా ఆమె రాజకీయ ప్రవేశంపై పట్టణంలో చర్చ జరుగుతోంది. పలాస స్థానిక రాజకీయాల్లో దువ్వాడ శ్రీకాంత్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. వరుసగా నాలుగుసార్లు కౌన్సిలర్‌గా ఎన్నికైన ఆయన, కార్మిక సంఘాల నాయకుడిగా కూడా కార్యకలాపాలు నిర్వహించారు. ముఖ్యంగా జీడిపప్పు పరిశ్రమ కార్మికుల సమస్యలపై పోరాడటంతో పాటు స్థానిక ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేశారు. మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుద్ధ్యం, మురుగునీటి కాలువలు, తాగునీటి సరఫరా వంటి అంశాలపై ఆయనకు అనుభవం ఉందని అనుచరులు చెబుతున్నారు. గతంలో మున్సిపల్ చైర్మన్ పదవిని ఆశించినప్పటికీ అవకాశం దక్కకపోవడంతో ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరడంతో ఈసారైనా చైర్మన్ పీఠం శ్రీకాంత్ వాసులకు ఊరిస్తుందని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. అనంతరం తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో తన రాజకీయ అనుభవాన్ని ప్రజాసేవకు ఉపయోగించుకునేలా కుమార్తె డాక్టర్ శ్రీజను రాజకీయాల్లోకి తీసుకురావాలనే ఆలోచన చేస్తున్నట్లు చర్చ సాగుతోంది.

డాక్టర్ దువ్వాడ శ్రీజ రాజకీయ ప్రవేశంపై జరుగుతున్న చర్చకు ఆమె విద్యార్హత ప్రధాన కారణంగా కనిపిస్తోంది. వైద్యురాలిగా ఎదిగిన ఆమె ప్రజా జీవితంలోకి వస్తే ఆరోగ్యం, మహిళా సంక్షేమం, చిన్నారుల సంరక్షణ, పేదలకు వైద్య సేవలు వంటి అంశాలపై దృష్టి సారించే అవకాశం ఉంటుందని ఆమె మద్దతుదారులు అభిప్రాయపడుతున్నారు. ఉద్దానం ప్రాంతంలో మూత్రపిండాల వ్యాధులు, ప్రజారోగ్య సమస్యలపై దీర్ఘకాలంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో వైద్య నేపథ్యం కలిగిన వ్యక్తి స్థానిక పాలనలో భాగస్వామి కావడం ప్రాధాన్యం సంతరించుకుంటుందని వారు చెబుతున్నారు. వైద్య విద్య ఒక్కటే రాజకీయ విజయానికి కొలమానం కాదనే అంశాన్ని కూడా పరిశీలించాల్సి ఉంది. స్థానిక సమస్యలపై అవగాహన, ప్రజలతో నిరంతర సంబంధాలు, పరిపాలనా సామర్థ్యం, అభివృద్ధిపై స్పష్టమైన ప్రణాళికలు కూడా ప్రజాప్రతినిధుల ఎంపికలో కీలకంగా ఉంటాయని రాజకీయ పండితులు అంటున్నారు. ఈ అంశాల్లో శ్రీజ తనదైన కార్యాచరణను ఎలా రూపొందిస్తారన్నది ఆమె రాజకీయ ప్రవేశం ఖరారైతే స్పష్టమయ్యే అవకాశం ఉందని దువ్వాడ వర్గం ప్రచారం చేసుకుంటుంది.

### పార్టీ అవకాశం ఇస్తే పోటీకి సిద్ధమేనా?

డాక్టర్ శ్రీజ స్వతంత్ర ఆలోచనలు కలిగిన వ్యక్తి అని, రాజకీయ పదవిని ఆశించడం కంటే ప్రజాసేవకు ప్రాధాన్యం ఇస్తారని ఆమెకు సన్నిహితంగా ఉండే వర్గాలు చెబుతున్నారు. ఏదైనా ప్రధాన రాజకీయ పార్టీ ఆమె విద్యార్హతలు, సేవా దృక్పథాన్ని గుర్తించి అవకాశం కల్పిస్తే పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు దువ్వాడ వర్గం వెల్లడించాయి. మరోవైపు, శ్రీకాంత్‌కు ఉన్న రాజకీయ అనుభవం, కార్మిక సంఘాల్లో పరిచయాలు, స్థానిక ప్రజలతో సంబంధాలు కుమార్తె రాజకీయ ప్రయాణానికి తోడ్పడవచ్చని ఆయన అభిమానులు భావిస్తున్నారు. తండ్రి అనుభవం, కూతురి విద్య కలిస్తే కొత్త తరహా నాయకత్వానికి అవకాశం ఏర్పడుతుందన్నది వారి అభిప్రాయం. అదే సమయంలో శ్రీజ తనకంటూ స్వతంత్ర గుర్తింపును సంపాదించుకోవడం, ప్రజా సమస్యలపై తన వైఖరిని వెల్లడించడం కూడా ప్రాధాన్యం సంతరించుకోనుంది.

### కూటమిలో ఆశావహులు..

### వైసీపీలోనూ మహిళా అభ్యర్థులపై చర్చ

పలాస--కాశీబుగ్గ పురపాలక సంఘం చైర్‌పర్సన్ పదవికి సంబంధించి తెలుగుదేశం కూటమిలోనే పలువురు ఆశావహులు ఉన్నట్లు రాజకీయ పండితులు అంటున్నారు. పలాస వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్ల శ్రీనివాసరావు కుటుంబం నుంచి కూడా మహిళా అభ్యర్థిని రంగంలోకి దించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ ఉంది. ఆయన కుటుంబం ముందుకు తెచ్చే అభ్యర్థికి అవకాశం లభిస్తుందా, లేక ఇతర ఆశావహులకు పార్టీ ప్రాధాన్యం ఇస్తుందా అన్నది అధిష్ఠానం నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

ఇక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనూ మహిళా అభ్యర్థుల పేర్లు వినిపిస్తున్నాయి. మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పీవీ సతీష్ కుటుంబం నుంచి ఒకరిని, రెడ్డిక సామాజిక వర్గానికి చెందిన బోర భగవతి కుటుంబం నుంచి బోర చంద్రకళను అభ్యర్థులుగా పరిశీలించే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది.

### సామాజిక సమీకరణాలు.. అభ్యర్థి ఎంపికే కీలకం

పలాస మున్సిపాలిటీ ఎన్నికల్లో సామాజిక వర్గాల సమీకరణాలు, గత ఎన్నికల్లో అభ్యర్థులకు లభించిన మద్దతు, స్థానిక నాయకుల ప్రభావం కీలకంగా మారే అవకాశం ఉంది. కళింగ, కళింగ కోమటి, రెడ్డిక తదితర సామాజిక వర్గాలతో పాటు ఇతర వర్గాల మద్దతును కూడగట్టడం ప్రధాన పార్టీలకు సవాలుగా నిలవనుంది. అయితే ఒక సామాజిక వర్గం మొత్తం ఒకే అభ్యర్థికి మద్దతు ఇస్తుందని ముందుగానే నిర్ధారించలేం. అభ్యర్థుల వ్యక్తిగత పరిచయాలు, ప్రజా సమస్యలపై వారి వైఖరి, పార్టీ బలం, ఎన్నికల సమయంలో చేపట్టే ప్రచారం వంటి అంశాలు కూడా ప్రభావం చూపనున్నాయి.

### ప్రజల ముందున్న ప్రధాన ప్రశ్నలు

పలాస--కాశీబుగ్గ పట్టణంలో తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల, అంతర్గత రహదారులు, పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక వంటి సమస్యలకు పరిష్కారం చూపగల నాయకత్వం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో డాక్టర్ శ్రీజ రాజకీయాల్లోకి వస్తే ఆమె అభివృద్ధి ప్రణాళిక ఏమిటి? వైద్య రంగంలో తనకున్న పరిజ్ఞానాన్ని పట్టణ ప్రజారోగ్యానికి ఎలా ఉపయోగిస్తారు? మహిళలు, యువత, కార్మికులు, పేద కుటుంబాల సమస్యల పరిష్కారానికి ఎలాంటి కార్యాచరణ రూపొందిస్తారు? అన్న అంశాలు చర్చకు వస్తున్నాయి.

మొత్తంగా, నాలుగుసార్లు కౌన్సిలర్‌గా గెలిచిన దువ్వాడ శ్రీకాంత్ రాజకీయ అనుభవం, డాక్టర్ శ్రీజ విద్యార్హత, ప్రజాసేవపై ఆమెకు ఉన్న ఆసక్తి చుట్టూ పలాస రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. అయితే ఆమె రాజకీయ ప్రవేశం, పార్టీ ఎంపిక, అభ్యర్థిత్వం, ఎన్నికల బరిలో నిలిచే అంశాలపై అధికారిక నిర్ణయం వెలువడిన తర్వాతే స్పష్టత రానుంది. తండ్రి రాజకీయ వారసత్వాన్ని కూతురు కొనసాగిస్తారా? వైద్య వృత్తి నుంచి ప్రజా జీవితంలోకి అడుగుపెడతారా? అన్న ప్రశ్నలకు రాబోయే పరిణామాలే సమాధానం చెప్పనున్నాయి.



## క్రీడలకు బంగారు భవిష్యత్

### - క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్యే శిరీష

### - ఘనంగా 50వ రాష్ట్ర అంతర్‌జిల్లాల టెన్నికాయిట్ పోటీల ముగింపు

### - జాతీయ పోటీలకు పురుషులు, మహిళల జట్ల ఎంపిక



**పలాస, అక్టోబరు 13 (వార్త):** క్రీడలకు ముఖ్యమంత్రి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ, క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు కల్పించేందుకు కృషి చేస్తోందని పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష అన్నారు. పలాస ప్రభుత్వ పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన స్వర్ణ క్రీడోత్సవం, 50వ ఆంధ్రప్రదేశ్ అంతర్‌జిల్లాల సీనియర్ పురుషులు, మహిళల టెన్నికాయిట్ రాష్ట్రస్థాయి పోటీల ముగింపు వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, జట్టుగా పనిచేసే నైపుణ్యాన్ని అలవరిస్తాయని అన్నారు. క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే నిరంతర సాధన, క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, గత ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో 368 పోస్టులను భర్తీ చేయడం ఇందుకు నిదర్శనమని తెలిపారు. పలాసలో మినీ క్రీడా ప్రాంగణం నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల ప్రోత్సాహానికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. రాష్ట్రస్థాయిలో రాణించిన క్రీడాకారులు జాతీయస్థాయిలోనూ విజయాలు సాధించి ఆంధ్రప్రదేశ్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

క్రీడల అభివృద్ధిలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన వజ్జ బాబూరావు మాట్లాడుతూ పలాస ప్రాంతంలో వ్యాయామ ఉపాధ్యాయుల కృషితో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. క్రీడల అభివృద్ధికి ఉపాధ్యాయులతో పాటు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమానికి మల్లా సంతోష్‌కుమార్ అధ్యక్షత వహించగా, జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పి. తవిటయ్య వ్యాఖ్యాతగా వ్యవహరించారు. రాష్ట్ర టెన్నికాయిట్ సంఘం ప్రధాన కార్యదర్శి కేఎన్‌వీ సత్యనారాయణ, కోశాధికారి రమేష్, రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం సాంకేతిక కమిటీ అధ్యక్షుడు కె. హరిబాబు, జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యక్షులు ఎస్. రామారావు, సీహెచ్. పద్మలోచనం, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్. చంద్రశేఖర్, కె. రామారావు, పి. సునీత, తెలుగుదేశం పార్టీ నాయకులు గాలి కృష్ణారావు, నరసింహ, తిరుమల, పట్ట మల్లేష్, నవీన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## 16న సూర్యోదయ స్కూల్‌లో సరస్వతీపూజ, అక్షరాభ్యాసం



**మందస, అక్టోబరు 13(వార్త):** మందస పట్టణంలోని అగ్నిగంగా వారి సూర్యోదయ స్కూల్ లో ఈ నెల 16న శ్రీ సరస్వతీ దేవి పూజా మహోత్సవం, అక్షరాభ్యాస ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నట్టు డైరక్టర్ మోణింగి నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ పిల్లి లోకేశ్వరరావు చెప్పారు. మందసలోని అగ్నిగంగా వారి సూర్యోదయ స్కూల్ లో తేది.16-10-2026 శుక్రవారం వేద పండితులచే విద్యాదేవత అయిన శ్రీ సరస్వతీ దేవి పూజా మహోత్సవం అత్యంత వైభవంగా జరిపించబడుతుందన్నారు. ఈ శుభ సందర్భంగా 2026-27 విద్యా సంవత్సరానికి గాను అక్షరాభ్యాసం కూడా ప్రారంభించబడుతుందన్నారు. ఈ పవిత్రమైన పూజలో తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించదలచిన తల్లిదండ్రులు విచ్చేసి ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కోరారు. విద్యతో పాటు సంస్కారం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం, డిజిటల్, కంప్యూటర్ విద్య, క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య మా ప్రత్యేకతలుగా చెప్పారు. శ్రీ సరస్వతీ దేవి ఆశీస్సులతో మీ పిల్లల విద్యాభ్యాసానికి శ్రీకారం కావించాలని కోరారు. మరిన్ని వివరాలకు 8919141746, 7013760010 అనే ఫోన్ నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

## శ్రీముఖలింగంలో శరన్నవరాత్రి ఉత్సవాలు



**జలుమూరు, అక్టోబరు 13 (వార్త):** ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలోని శ్రీ వారాహి పార్వతి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ విషయాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) కె. ఏడుకొండలు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగ మహిళలతో సామూహిక కుంకుమార్చనలు చేపట్టారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించి, కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉత్సవాలు కొనసాగే తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు వివిధ రూపాల్లో ప్రత్యేక అలంకరణలు చేపట్టనున్నట్లు ఈవో వివరించారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆలయ అధికారులు కోరారు.



## 23వ వార్డుపై బమ్మిడి సంతోష్‌కుమార్ దృష్టి!

**పలాస, అక్టోబరు 13 (వార్త):** స్థానిక సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా పనిచేసిన బమ్మిడి సంతోష్ కుమార్ పేరు ప్రస్తుతం పలాస--కాశీబుగ్గ పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. గతంలో శివాజీ నగర్ అభివృద్ధికి కృషి చేసిన ఆయన, విస్తరించిన 23వ వార్డు నుంచి పోటీ చేస్తారా? అన్న అంశంపై స్థానికంగా ఆసక్తి నెలకొంది.



వెనుకబడిన ప్రాంతం నుంచి అభివృద్ధి దిశగా.. సుమారు 25 ఏళ్ల క్రితం ఏర్పాటైన శివాజీ నగర్‌లో ఒకప్పుడు సరైన రహదారులు, మురుగునీటి కాలువలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థలాల ధరలు పెరిగినా, కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో లేకపోవడం ఆ ప్రాంత ప్రజలకు సమస్యగా ఉండేది. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చే నాయకులు ఎందరో వచ్చినప్పటికీ, సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించలేదనే అసంతృప్తి ఉండేది. ఈ పరిస్థితుల్లో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బమ్మిడి సంతోష్ కుమార్ ప్రజాసేవలోకి అడుగుపెట్టారు.

ఉద్యోగాన్ని వదిలి ప్రజాసేవలోకి.. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అధ్యాపక ఉద్యోగం చేసిన అనుభవం ఉన్న సంతోష్ కుమార్, తన ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలనే సంకల్పంతో ఉద్యోగాన్ని విడిచిపెట్టి ప్రజాక్షేత్రంలోకి వచ్చారు. ఆయన సేవాభావాన్ని గుర్తించిన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, పురపాలక సంఘంలో సహనామినేటెడ్ సభ్యుడిగా అవకాశం కల్పించారు. ఆ బాధ్యతను స్వీకరించిన ఆయన శివాజీ నగర్‌లో నెలకొన్న మౌలిక సదుపాయాల కొరతను అధిగమించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. శివాజీ నగర్‌లో రహదారులు, మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగుపరచడమే ప్రాధాన్యంగా తీసుకున్న సంతోష్ కుమార్, కోటి రూపాయలకు పైగా నిధులు సమకూర్చి అభివృద్ధి పనులు చేపట్టినట్లు మాజీ కో ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్ వెల్లడించారు. ఇందులో భాగంగా 14 సీసీ రహదారుల నిర్మాణం, 20 ప్రధాన మురుగునీటి కాలువల ఏర్పాటు చేపట్టారు. ఈ పనులతో రాకపోకలకు ఎదురైన ఇబ్బందులు తగ్గడంతో పాటు, మురుగునీటి పారుదల సమస్య పరిష్కారానికి మార్గం ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధిగా బాధ్యతలు చేపట్టిన తరువాత కేవలం హామీలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పరిశీలిస్తూ వాటిని పూర్తిచేయించేందుకు కృషి చేయడం ఆయనకు గుర్తింపు తెచ్చిందని అనుచరులు చెబుతున్నారు. శివాజీ నగర్‌లో ఇంకా పరిష్కరించాల్సిన సమస్యలు ఉన్నాయనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. విస్తరించిన 23వ వార్డు.. మారనున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో పలాస--కాశీబుగ్గ పురపాలక పరిధిలో వార్డుల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో శివాజీ నగర్‌తో పాటు సూదికొండ ప్రాంతంలోని రెల్లి వీధి, సూర్య కాలనీ, నేతాజీ నగర్, సాయిభూల కాలనీలు కలిసి 23వ వార్డుగా ఏర్పడినట్లు సమాచారం. దీంతో గతంలో శివాజీ నగర్‌కే పరిమితమైన అభివృద్ధి అనుభవం, ఇప్పుడు విస్తరించిన ప్రాంతంలోని ప్రజల మద్దతును పొందడంలో ఎంతవరకు ప్రభావం చూపుతుందనేది ఆసక్తికరంగా మారింది. శివాజీ నగర్‌లో చేపట్టిన పనులు సంతోష్ కుమార్‌కు అనుకూల అంశాలుగా భావిస్తున్నప్పటికీ, కొత్తగా చేరిన కాలనీల్లోని సమస్యలు, స్థానికుల అవసరాలు, రాజకీయ పార్టీల నిర్ణయాలు, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపనున్నాయి. ఒక ప్రాంతంలో చేసిన అభివృద్ధి పనులు విస్తరించిన వార్డు అంతటా ప్రజల ఆదరణగా మారుతాయా అన్నది కూడా కీలకంగా మారనుంది.

అభ్యర్థిత్వంపై ఉత్కంఠ నెలకొన్న నేపథ్యంలో అభివృద్ధి పనుల అనుభవం, విద్యార్హత, ప్రజా సమస్యలపై అవగాహన తనకు బలమవుతాయని సంతోష్ కుమార్ మద్దతుదారులు భావిస్తున్నారు. మరోవైపు, 23వ వార్డులోని అన్ని ప్రాంతాల ప్రజల విశ్వాసాన్ని పొందడం, వారి అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళిక రూపొందించడం ఆయన ముందున్న సవాలుగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో బమ్మిడి సంతోష్ కుమార్ 23వ వార్డు నుంచి పోటీకి దిగుతారా? దిగితే విస్తరించిన వార్డులో తన అభివృద్ధి ప్రస్థానాన్ని ఎలా కొనసాగిస్తారు? అన్న ప్రశ్నలు స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తున్నాయి. ఏదేమైనా, శివాజీ నగర్‌లో గతంలో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రస్తుత స్థానిక రాజకీయ చర్చల్లో ఆయన పేరును ముందుకు తెస్తున్నాయి. సంతోష్ పార్టీకి ఏ విధంగా సేవ చేస్తారో, ప్రజలకు ఏ విధంగా సేవ చేస్తారో వేచి చూడవలసిన అవసరం ఉందని రాజకీయ పండితులు అంటున్నారు.

## మెరుగైన రవాణా సౌకర్యాలే లక్ష్యం



**మందస, అక్టోబరు 13(వార్త):** పలాస నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా గ్రామీణ ప్రాంతాల్లో రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష పేర్కొన్నారు. మందస మండలం నారాయణపురం గ్రామపంచాయతీ పరిధిలోని బంజిరికేశుపురం గ్రామంలో రూ.కోటి వ్యయంతో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును ఆమె ఘనంగా ప్రారంభించారు. అదేవిధంగా చిన్నకేశుపురం వద్ద రూ.85 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన బీటీ రహదారిని కూడా ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల దైనందిన జీవితాలను సులభతరం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ నూతన బీటీ రహదారి అందుబాటులోకి రావడంతో బంజరి కేశుపురం పరిసర ప్రాంత ప్రజల రాకపోకల ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు. ముఖ్యంగా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు సులభంగా తరలించడానికి, విద్యార్థులు, ఉద్యోగులు సౌకర్యవంతంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. అత్యవసర సమయాల్లో వైద్య సేవలు త్వరితగతిన పొందడానికి కూడా ఈ రహదారి దోహదపడుతుందని వివరించారు. నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేస్తామని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో మందస మండల అధ్యక్ష, కార్యదర్శులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కేన్సర్ బాలికకు

## సిక్కోలు ఉద్దానం సేవా సమితి ఆర్థికసాయం



**మందస, అక్టోబరు 13(వార్త):** కేన్సర్ తో బాధపడుతున్న బాలిక కర్రి తేజస్వినికు సిక్కోలు ఉద్దానం సేవా సమితి ఆధ్వర్యంలో 10,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాలి మండలం లోని లకిందిడ్డి గ్రామానికి చెందిన కర్రి తేజస్విని 14 సంవత్సరాలు తీవ్రమైన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. పాప ప్రాణాలు నిలవాలంటే అత్యవసరంగా రూ.22లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు. పేదరికంతో కూడుకున్న కుటుంబం కావడంతో పెద్ద మొత్తాన్ని భరించలేకపోతున్నారని దాతలు సహాయం కోరడం జరిగింది. వెంటనే స్పందించి సిక్కోలు ఉద్దానం సేవా సమితి నుండి 10000 రూపాయలు అందించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పృద్వి, రాజు, నవీన్, జగదీష్ తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆరోగ్య పరిరక్షణలో ఆశా వర్కర్లే కీలకం




**సోంపేట, అక్టోబరు 13(వార్త):** సమాజంలోని ఆరోగ్య పరిరక్షణలో ఆశా వర్కర్ల పాత్ర కీలకమని కొర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారినిణి డాక్టర్ రోషిని పేర్కొన్నారు. ఆసుపత్రి ఆవరణలో మంగళవారం ఆశా వర్కర్ల సమావేశంలో డాక్టర్ రోషిని మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుద్ధ్యం, సురక్షిత తాగునీరు మొదలైన వాటిని ప్రోత్సహించడంలో ఆశా వర్కర్లు బాధ్యతాయుతమైన పాత్రను పోషించాలని కోరారు. అంటువ్యాధుల విషయంలోనూ అప్రమత్తంగా ఉంటూ ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ఆహార పరిశుభ్రత విషయంలోనూ ప్రజలకు సరైన అవగాహన కల్పించాలని కోరారు. గర్భిణీ స్త్రీల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ అత్యవసర సందర్భాల్లో తప్పనిసరిగా ఆసుపత్రిలో చేర్పించే కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్ఓ మణిమాల, హెల్త్ ఎడ్యుకేటర్ వసంతకుమారి, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## సముద్ర వేటతో సంబంధం లేని వారికి మత్స్యకార సంఘాలు వద్దు

**మందస, అక్టోబరు 13(వార్త):** సముద్ర వేటతో సంబంధం లేని వ్యక్తులకు అక్రమంగా మత్స్యకార సహకార సంఘాలు ఏర్పాటు చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరుతూ సాగర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం తరపున జిల్లా పరిషత్ శ్రీకాకుళంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (స్పందన) కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. మందస మండలంలోని దున్నవూరు పంచాయతీ గెడ్డవూరు గ్రామానికి చెందిన మత్స్యకారులు ఈ వినతి పత్రాన్ని జాయింట్ కలెక్టర్ అందజేశారు. దీనిపై వెంటనే స్పందించిన జాయింట్ కలెక్టర్.. ఫిషరీస్ శాఖ అధికారిని పిలిపించి, నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి నూతన సంఘాలు ఏర్పాటు కాకుండా చూడాలని, వీటిపై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారని సాగర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ప్రతినిధులు చెప్పారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# పద్మనాభపురంలో తాగునీటి కష్టాలు

- రూ.10 లక్షలతో వేసిన రహదారికి తవ్వకాలు
- బురదనీటితో ప్రజల అవస్థలు
- ఐదు రోజులుగా ఇదే పరిస్థితి
- పట్టించుకోని అధికారులు



**పలాస, అక్టోబరు 13 (వార్త):** పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పద్మనాభపురం కాలనీలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. కొత్త పైపులైను నిర్మాణం పేరుతో ఇటీవల రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన రహదారిని తవ్వేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే మున్సిపాలిటీ ద్వారా ఏర్పాటు చేసిన నీటి సరఫరా పైపులైను ఉండగా, మళ్లీ కొత్తగా మరో పైపులైను వేస్తుండటంపై స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. కొత్త పైపులైను పనుల కారణంగా గతంలో నీటి కుళాయి కనెక్షన్లు పొందిన వారి సరఫరా మార్గాలను తొలగించడంతో కాలనీలో తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో భూగర్భజలాలు ఉప్పగా ఉండటంతో బావుల నీటిని తాగడానికి వినియోగించలేని పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. దీంతో మున్సిపాలిటీ ద్వారా సరఫరా అయ్యే నీరే తమకు ప్రధాన ఆధారమని అంటున్నారు. గత ఐదు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో బురదనీరు నిలిచిన ప్రాంతాల్లోకి దిగి నీటిని పట్టుకుంటున్నారు. సమీపంలోని మురుగునీటి కాలువ నుంచి కలుషిత నీరు అందులో కలిసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. దాహం తీర్చుకోవడానికి మరో మార్గం లేకపోవడంతో నీటి స్వచ్ఛతను పట్టించుకోలేని దుస్థితి ఏర్పడిందని కాలనీవాసులు వాపోతున్నారు.

కొత్త పైపులైను నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో నీటి సరఫరా పునరుద్ధరణలో జాప్యం జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒకవైపు రహదారిని తవ్వేయడం, మరోవైపు ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్లు చేయకపోవడం ప్రజలకు ఇబ్బందిగా మారింది. అభివృద్ధి పనులు చేపట్టే సమయంలో ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అంటున్నారు. మురుగునీరు కలిసే అవకాశం ఉన్న బురదనీటిని తాగడం వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు కలుషిత నీటి వినియోగం వల్ల అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తగిన స్పందన కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైను పనులు ప్రారంభించే ముందు పాత సరఫరా వ్యవస్థకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కొత్త పైపులైను అవసరం, ఇప్పటికే ఉన్న పైపులైను పరిస్థితి, రహదారి తవ్వకాల వల్ల కలిగిన నష్టం వంటి అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. తక్షణమే పనులను వేగవంతం చేసి, సురక్షితమైన తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని, కలుషిత నీరు తాగాల్సిన పరిస్థితికి ముగింపు పలకాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల దాహం తీర్చాల్సిన నీటి సరఫరా పనులే వారికి కష్టాలను తెచ్చిపెడితే ఎలా? ఐదు రోజులుగా తాగునీటి కోసం అవస్థలు పడుతున్న పద్మనాభపురం కాలనీవాసులకు మున్సిపల్ అధికారులు ఎప్పుడు ఉపశమనం కల్పిస్తారు? ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడకముందే స్పందించి సమస్యను పరిష్కరిస్తారా? అనేది వేచి చూడాలి.

## అనర్హులకు మత్స్యకార సంఘాలు ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదు



**మందస, అక్టోబరు 13(వార్త):** మందస మండలంలోని దున్నవూరు పంచాయతీ గెడ్డవూరు గ్రామంలో సాగర మత్స్య పారిశ్రామిక సహకార సంఘ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సముద్ర వేటతో సంబంధం లేని వ్యక్తులకు అక్రమంగా మత్స్యకార సహకార సంఘాలు ఏర్పాటు చేయడానికి కొందరు చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా సంఘాలు ఏర్పాటు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. తరతరాలుగా సముద్ర వేటపైనే ఆధారపడి జీవిస్తున్న తమ 150 కుటుంబాల నోరు కొట్టి, ప్రభుత్వం అందించే వేట నిషేధ భృతి, సబ్సిడీలు, ఇతర సంక్షేమ ఫలాలను అనర్హులు పొందే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే తరహాలో కాగితాలపై సంఘాలు సృష్టిస్తే తమ సాంప్రదాయ వృత్తి, ఉనికికే ప్రమాదమని తెలిపారు. ఈ విషయంపై పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష వినతి పత్రం అందజేసి మత్స్య శాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి అనర్హుల సంఘాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ వంక ఢిల్లేశ్వరావు, వంక ధర్మరాజు, పిచ్చుక శేఖర్, పిచ్చుక మోహనరావు, కోడ చండీరావు, పిచ్చుక శాంతరావు, గ్రామ యువకలు తదితర సభ్యులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తగా భవానికి పదోన్నతి



**పలాస, అక్టోబరు 13 (వార్త):** అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు, క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్న కార్యకర్తలకు తగిన గుర్తింపు కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా సవర భవానికి పదోన్నతి లభించింది. పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష మంగళవారం తన కార్యాలయంలో ఆమెకు పదోన్నతి ఉద్యోగ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

పలాస సమగ్ర శిశు అభివృద్ధి పథకం పరిధిలోని లుత్తూరు గ్రామపంచాయతీ, ఉగ్రపలియ గ్రామంలో సవర భవాని ఇప్పటివరకు మినీ అంగన్వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా ఆమె కేంద్రాన్ని ప్రధాన అంగన్వాడీ కేంద్రంగా ఉన్నతీకరించడంతో, భవాని ప్రధాన అంగన్వాడీ కార్యకర్తగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాన్ని అందుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. గత ఏడాది డిసెంబరులో పలాస సమగ్ర శిశు అభివృద్ధి పథకం పరిధిలో 30 మంది మినీ అంగన్వాడీ కార్యకర్తలను ప్రధాన అంగన్వాడీ కార్యకర్తలుగా పదోన్నతి సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ నిర్ణయంతో అర్హులైన కార్యకర్తలకు విధుల నిర్వహణలో మరింత గుర్తింపు లభించడంతోపాటు, అంగన్వాడీ సేవలను సమర్థంగా అందించేందుకు అవకాశం కలుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, ఆరోగ్య అవగాహన, ప్రాథమిక బాల్య సంరక్షణ వంటి సేవలు అందించడంలో అంగన్వాడీ కార్యకర్తల పాత్ర కీలకం. మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా ఉన్నతీకరించడం ద్వారా అంగన్వాడీ వ్యవస్థలో పనిచేస్తున్న సిబ్బందికి గుర్తింపు కల్పించడంతోపాటు, గ్రామీణ ప్రజలకు అందే సేవలను మరింత పటిష్ఠం చేయడానికి దోహదపడుతుంది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఓ కవిటి పార్వతి, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ పోటీలకు పలాసలో ఎంపికైన క్రీడాకారులు

- రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభకు గుర్తింపు
- పురుషులు, మహిళల విభాగాల్లో ఆరుగురికి అవకాశం

**పలాస, అక్టోబరు 13 (వార్త):** రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో ప్రతిభ కనబరిచి సత్తా చాటిన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పురుషులు, మహిళల విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన ఆరుగురితో కూడిన రెండు జట్లను జాతీయ పోటీలకు ఎంపిక చేసినట్లు రాష్ట్ర క్రీడా పోటీల నిర్వాహక కార్యదర్శి పి. తవిటయ్య, రాష్ట్ర టెన్నికాయిట్ సంఘం ప్రధాన కార్యదర్శి కేఎన్వీ సత్యనారాయణ తెలిపారు.

పురుషుల విభాగంలో ఎంపికైనవారు: కాకినాడకు చెందిన వి. వినయ్‌కుమార్, పి.జె. ఎండీ రామారావు, బి. సత్యనారాయణ, మన్యం జిల్లాకు చెందిన ఎస్. రాహుల్, శ్రీకాకుళం జిల్లాకు చెందిన బి. సిద్ధార్థ, విజయనగరానికి చెందిన కె. చంద్రమౌళి ఉన్నారు. ప్రత్యామ్నాయ క్రీడాకారులుగా కోనసీమకు చెందిన ఎల్. త్రిమూర్తులు, శ్రీకాకుళానికి చెందిన కె. ప్రవీణ్‌కుమార్ ఎంపికయ్యారు.

మహిళల విభాగంలో ఎంపికైనవారు: తూర్పు గోదావరి జిల్లాకు చెందిన జి. హేమమాధురి, ఎం. ప్రియదర్శిని, విజయనగరానికి చెందిన ఆర్. మౌనిక, రేణుక, జి. శ్రావణి, శ్రీకాకుళానికి చెందిన ఎన్. దివ్య జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. ప్రత్యామ్నాయ క్రీడాకారిణులుగా శ్రీకాకుళానికి చెందిన పి. శ్రావణ పాత్రో, విజయనగరానికి చెందిన కె. ఇందును ఎంపిక చేశారు.

రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణతో వివిధ ప్రాంతాల్లోని క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు మంచి వేదిక లభించిందని నిర్వాహకులు వెల్లడించారు. క్రీడాకారుల విజయానికి వ్యాయామ ఉపాధ్యాయులు, నిర్వాహకులు, దాతల సహకారం ఎంతో దోహదపడిందని అభినందించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, జాతీయస్థాయిలో రాణించేలా ప్రోత్సహించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జాతీయస్థాయిలోనూ ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.



## రంగోయి చెడ్డెమ్మ తల్లి సాక్షిగా వైసీపీ ఎన్నికల శంఖారావం

- స్థానిక పోరుకు సమాయత్తం
- ప్రతి పంచాయతీలో పట్టు సాధించడమే లక్ష్యం
- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు దిశానిర్దేశంలో ముందుకు



**పలాస, అక్టోబరు 13 (వార్త):** స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పలాస మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కార్యాచరణకు శ్రీకారం చుట్టాయి. రంగోయి గ్రామంలోని శ్రీ చెడ్డెమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మండల నాయకులు ఎన్నికల సన్నద్ధతపై మంగళవారం సమావేశమయ్యారు. మాజీ మంత్రి, పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదేశాల మేరకు పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ గ్రామస్థాయిలో బలాన్ని పెంచుకోవాలని నిర్ణయించారు. ఆలయ వేదికగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా స్థానిక ఎన్నికలకు తమ శ్రేణులను సిద్ధం చేసే ప్రయత్నాన్ని పార్టీ నాయకత్వం ప్రారంభించింది. మండలంలోని వివిధ పంచాయతీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు రంగోయికి తరలివచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించి, పార్టీ విజయం సాధించాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో గ్రామాలవారీగా పార్టీ పరిస్థితి, కార్యకర్తల సమీకరణ, ఎన్నికల వ్యూహాలపై చర్చించారు. ప్రతి పంచాయతీలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజలతో సంబంధాలను మరింత పెంచుకోవడంపై దృష్టి సారించాలని నిర్ణయించారు. స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలంటే గ్రామస్థాయి నాయకత్వం క్రియాశీలంగా ఉండాలని వైసీపీ నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రతి పంచాయతీలో పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించడం, ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠం చేసి, యువత, మహిళలను కలుపుకొని ముందుకు సాగాలని భావిస్తున్నారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, ప్రస్తుత ప్రభుత్వ పాలనలోని లోపాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని నాయకులు అంటున్నారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు తదితర సమస్యలపై ప్రజలతో చర్చించి, వారి పక్షాన నిలబడతామని వెల్లడించారు. అయితే స్థానిక ఎన్నికల్లో ప్రజల మద్దతు సాధించాలంటే గత పాలనను వివరించడమే కాకుండా, ప్రస్తుత ప్రజా సమస్యలపై స్పష్టమైన కార్యాచరణను ప్రజల ముందుంచడం కూడా కీలకం కానుంది.

### ఐక్యతతో అత్యధిక స్థానాలు సాధిస్తాం

వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పైల చిట్టిబాబు మాట్లాడుతూ మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు నాయకత్వంలో పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా పనిచేసి స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతాయని తెలిపారు. గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, ప్రతి పంచాయతీలో పార్టీ విజయానికి కృషి చేస్తామని అంటున్నారు. గ్రామస్థాయి కమిటీలను బలోపేతం చేసి, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ఎన్నికల కార్యాచరణను విస్తరిస్తామని వెల్లడించారు. రాష్ట్ర కార్యదర్శి ఉంగ సాయికృష్ణ, అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధన, మండల అధ్యక్షుడు దువ్వాడ రవి తదితరులు కూడా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. పంచాయతీల వారీగా నాయకులు, కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించి, ప్రజలతో నేరుగా సంబంధాలు పెంచుకోవాలని అంటున్నారు. అధికార పక్షం హామీలు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజల్లో చర్చకు తీసుకెళ్లి, స్థానిక ఎన్నికల్లో ప్రజా మద్దతు పొందేందుకు కృషి చేస్తామని తెలిపారు. రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్న రంగోయి సమావేశం

పలాస మండలంలో స్థానిక ఎన్నికలపై స్పష్టత కోసం రాజకీయ పార్టీలు ఎదురుచూస్తున్న నేపథ్యంలో వైసీపీ నాయకులు రంగోయి వేదికగా సమావేశం నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ శ్రేణులను ముందుగానే సమాయత్తం చేయడం, గ్రామాలవారీగా బలాబలాలను అంచనా వేయడం, ప్రజా సమస్యలను ఎన్నికల అంశాలుగా ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలు రానున్న రోజుల్లో పార్టీ వ్యూహంలో కీలకంగా మారనున్నాయి. సమావేశంలో వ్యక్తమైన విజయ ధీమా క్షేత్రస్థాయిలో ఎంతవరకు ఓట్ల మద్దతుగా మారుతుందన్నది అభ్యర్థుల ఎంపిక, స్థానిక నాయకుల సమన్వయం, ప్రజా సమస్యలపై పార్టీ స్పందనపై ఆధారపడి ఉంటుందని రాజకీయ పండితులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలాస మండల వైసీపీ అధ్యక్షుడు దువ్వాడ రవితో పాటు బత్తిన హేమేశ్వరరావు, మచ్చ ధనరాజ్, చింతాడ మాధవరావు, సంతోష్ సూర్య, గొండు మోహన్, షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు. వివిధ పంచాయతీలకు చెందిన సీనియర్ నాయకులు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## చిన్న గురుదాసుపురం జంక్షన్‌లో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దు

- విద్యార్థులు, మహిళల భద్రతకు విఘాతం కలగకుండా చూడాలి
- ప్రతిపాదిత మద్యం దుకాణాన్ని నిలిపివేయాలని
- ఎమ్మెల్యే గౌతు శిరీషకు గ్రామస్థుల వినతి



**పలాస, అక్టోబరు 13 (వార్త):** చిన్న గురుదాసుపురం జంక్షన్ వద్ద ప్రతిపాదించిన మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయవద్దని చిన్న గురుదాసుపురం, కొబ్బరి చెట్లూరు, చిన్నమామిడిమెట్టు గ్రామాలకు చెందిన యువకులు, ప్రజలు శాసనసభ్యురాలు గౌతు శిరీషకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమెకు వినతిపత్రం అందజేసి, ఇప్పటికే కొనసాగుతున్న అక్రమ మద్యం విక్రయ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ మద్యం వినియోగం కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్దానం వంటి గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల కుటుంబ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడటంతోపాటు, సామాజిక సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు. అందువల్ల ప్రజల జీవన పరిస్థితులు, గ్రామాల ప్రశాంతతను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదిత దుకాణాన్ని నిలిపివేయాలని కోరారు. చిన్న గురుదాసుపురం జంక్షన్ సమీపంలోని ప్రధాన రహదారి మీదుగా రంగోయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారని గ్రామస్థులు వివరించారు. అదే ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్దానం ప్రాంతంలో మహిళలు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు జీడి తోటల్లో పనులు చేసుకోవడంతోపాటు పశువుల పోషణ, వ్యవసాయ పనుల నిమిత్తం నిరంతరం సంచరిస్తుంటారని తెలిపారు. ఈ నేపథ్యంలో మహిళల భద్రత, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అక్కడ మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వవద్దని విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో ఇప్పటికే కొనసాగుతున్న అక్రమ మద్యం విక్రయాలను అరికట్టడంతోపాటు, యువతను మద్యానికి దూరంగా ఉంచేందుకు కృషి చేస్తామని యువకులు స్పష్టం చేశారు. మద్యం రహిత ఉద్దానం నిర్మాణానికి గ్రామస్థులంతా కలిసికట్టుగా ముందుకు సాగుతామని తెలిపారు. గ్రామస్థుల వినతిపై స్పందించిన ఎమ్మెల్యే గౌతు శిరీష.. ఆ ప్రాంతంలో మద్యం దుకాణాలు ఏర్పాటు కాకుండా చూస్తామని హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చిన్న గురుదాసుపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు కే. తేజేశ్వరరావు, కార్యదర్శి జినగ దేవదాసు, శ్రీధర్, దిలీప్, మాధవరావు, తాతారావు, చిన్నమామిడిమెట్టు గ్రామ పెద్దలు గేదెల సింహాచలం, గార సత్యం, కొబ్బరి చెట్లూరు గ్రామ పెద్దలు జానకిరావు, బచ్చల శ్రీనివాస్, ధర్మారావు, చిన్న గురుదాసుపురం గ్రామ పెద్దలు ధర్మారావు, రమేష్, సీతారాజు, ప్రభాకర్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పలాస-కాశీబుగ్గలో రూ.25 కోట్లతో రహదారుల అభివృద్ధి

- 21 పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే శిరీష
- కాలనీలు, గ్రామాలకు మెరుగైన అనుసంధానం, బీటీ, సీసీ రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం



**పలాస, అక్టోబరు 13 (వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధిలో రహదారి సౌకర్యాల విస్తరణకు రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. హెచ్ఏఎం పథకం కింద మంజూరైన ఈ నిధులతో 21 ప్రాంతాల్లో బీటీ, సీసీ రహదారులు నిర్మించేందుకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష శంకుస్థాపన చేశారు. ప్రధాన రహదారులకు అనుబంధంగా కాలనీలు, గ్రామాలు, అంతర్గత వీధులను అనుసంధానించడం ద్వారా ప్రజల రాకపోకలను సులభతరం చేయడం ఈ పనుల ప్రధాన ఉద్దేశం.

పురపాలక సంఘ పరిధిలో పెరుగుతున్న నివాస ప్రాంతాలు, పారిశ్రామిక అవసరాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, రవాణా కేంద్రాలకు అనుగుణంగా రహదారి సదుపాయాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ఎంపిక చేసిన మార్గాల్లో నూతన రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యమిచ్చారు. ముఖ్యంగా పలాస ఆర్టీసీ సముదాయం, జాతీయ రహదారి, పారిశ్రామిక ప్రాంతం, వివిధ గ్రామాలకు వెళ్లే మార్గాల్లో అనుసంధానం మెరుగుపడేలా పనులను రూపొందించారు.

### 21 ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం

పురుషోత్తపురం ఎర్రచెరువు గట్టు వద్ద సామూహిక మరుగుదొడ్ల సమీపం నుంచి పారిశ్రామిక ప్రాంతంలోని ప్రస్తుత బీటీ రహదారి వరకు కొత్త రహదారిని నిర్మించనున్నారు. నర్సిపురం ప్రధాన రహదారి నుంచి ఆ గ్రామ కాలనీలోని సీసీ రహదారి వరకు, నెమలి నుంచి నారాయణపురం వరకు, ఐటీఐ కళాశాల ప్రధాన రహదారి నుంచి పలాస ఆర్టీసీ సముదాయం వరకు సీసీ రహదారులు వేయనున్నారు.

ఎంఆర్వో కార్యాలయం ప్రధాన రహదారి నుంచి మంకినమ్మ ఆలయానికి ఎదురుగా ఉన్న వీధి వరకు, జయరామచంద్రపురంలో అత్తడవారి వీధి వరకు, పోతనపల్లి వీధి నుంచి పంపుహౌస్ మీదుగా జగన్నాథసాగరం సమీపంలోని అయ్యప్ప ఆలయం వరకు రహదారులు నిర్మించనున్నారు. రాజాం ప్రధాన రహదారి నుంచి మీలగారంపాడు వరకు, మొగిలిపాడు జాతీయ రహదారి నుంచి అడవికొత్తూరు వరకు, జాతీయ రహదారి నుంచి పరసంబ గ్రామం వరకు సీసీ రహదారులు చేపట్టనున్నారు.

కేటీ రహదారిలోని గంటాయత్ కూడలి నుంచి ఉదయపురంలోని దేకూరు కొండ వరకు, కాశీబుగ్గ టెలిఫోన్ మార్పిడి కేంద్రం నుంచి మూడు రోడ్ల కూడలి వరకు, వినాయక ఆలయం నుంచి పారిశ్రామిక ప్రాంతంలోని బీటీ రహదారి వరకు పనులు చేపట్టనున్నారు. వివేకానందనగర్ నుంచి అన్నపూర్ణ ఆశ్రమం వరకు, గౌతమ్ వీధి కూడలి నుంచి భద్రమ్మ కోనేరు వరకు, అంతరాకుడ్డలోని చెరువు నుంచి ఎంపీఈపీ పాఠశాల వరకు రహదారులు నిర్మించనున్నారు.

మొగిలిపాడు కూడలి నుంచి ఇందిరా చౌక్ వరకు బీటీ రహదారి, రోటరీనగర్‌లో సూడికొండ ప్రధాన రహదారి నుంచి చిలకల వీధి చివరి వరకు సీసీ రహదారి పనులు చేపట్టనున్నారు. నీలాపురం కాలనీలోని ప్రస్తుత బీటీ రహదారి నుంచి నీలాపురం గ్రామం వరకు, మహారాణిపేటలో ప్రస్తుత సీసీ రహదారి నుంచి పంపుహౌస్ వరకు, అడవికొత్తూరు కూడలి నుంచి కోసంగిపురం వరకు రహదారుల నిర్మాణం ఈ ప్రణాళికలో భాగంగా ఉంది.

### రవాణా సౌకర్యాల మెరుగుదలకు అవకాశం

ఈ పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల ప్రజలకు రోజువారీ ప్రయాణాల్లో సౌలభ్యం పెరగనుంది. గ్రామాలు, కాలనీల నుంచి ప్రధాన రహదారులకు చేరుకునే మార్గాలు మెరుగుపడటంతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, పారిశ్రామిక ప్రాంతాలకు వెళ్లే వారికి రవాణా సౌకర్యం కలగనుంది. అయితే నిర్మాణాల నాణ్యత, నిర్దేశిత కాలపరిమితిలో పనుల పూర్తి, అనంతర నిర్వహణ కూడా ఈ ప్రాజెక్టు ప్రయోజనాలు ప్రజలకు అందడంలో కీలకంగా ఉండనున్నాయి.

హెచ్ఏఎం పథకం కింద మంజూరైన రూ.25 కోట్లతో 21 రహదారి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే గౌతు శిరీష వివరించారు. నిర్మాణాలు పూర్తయిన అనంతరం పలాస-కాశీబుగ్గ పట్టణ పరిధిలోని రవాణా అనుసంధానం మరింత మెరుగుపడే అవకాశం ఉంది.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546